క్లుప్తంగా

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

అచ్చంపేట రూరల్: నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ కృష్ణయ్య హెచ్చరించారు. బుధవారం అచ్చంపేటలో ఎరువులు, విత్తనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. విత్తనాల సరఫరా, నాణ్యత, ధరలు, ఎరువుల అందుబాటు, రైతులకు అందించాల్సిన పంట పద్ధతుల సమాచార పంపిణీ, పురుగు మందుల వినియోగంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. డీలర్లు మందుల వివరాలను స్టాక్ బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు కృష్ణయ్య, నరేష్, రమేష్, మహేష్‌రెడ్డి, అనీల్, సూరజ్, ప్రియదర్శిని, డీలర్లు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి భూమి పూజ



పెద్దకొత్తపల్లి: మండలంలోని మరికల్‌లో సీసీ రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్‌గౌడ్ బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల నుంచి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయన్నారు. పనులను కాంట్రాక్టర్ నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తిచేయాలన్నారు. ఇమామ్ గౌడ్, నరేంద్రరాచారి, హబీబ్, రమేష్ పాల్గొన్నారు.

కులగణన నిర్ణయంపై హర్షం

చారకొండ: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్రం తీసుకున్న నిర్ణయంపై బీజేపీ మండల నాయకుడు కిరణ్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన ప్రకటనతో ప్రధాని నరేంద్రమోడీ పాలన, నిబద్ధతను ప్రతిబింబిస్తోందన్నారు. నాయకులు అనిల్, కన్నా తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి రూరల్: కుల గణనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై బీసీ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు, బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి నియోజకవర్గ కన్వీనర్ మేకల రాజేందర్‌లు బుధవారం వేర్వేరుగా ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కులగణనపై నిర్ణయం తీసుకోవడం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ తో పాటు మంత్రులకు రమేష్ బాబు, రాజేందరలు కృతజ్ఞతలు తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

కోడేరు: మండల కేంద్రంతో పాటు బావాయిపల్లి, తదితర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను మాజీ ఎంపీపీ కొత్తరా మ్మోహన్‌రావు, మాజీ సర్పంచ్ నక్క వేణుగోపాల్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీం, మాజీ వార్డు సభ్యులు రాజు, రామకృష్ణ, పొం దేళ్ల సురేష్, కుర్మయ్య, చామంతి రాజు, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే షీ టీం లక్ష్యం



తాడూరు: మహిళల భద్రతే షీ టీం ప్రధాన లక్ష్యమని జిల్లా షీ టీం సభ్యుడు వెంకటయ్య అన్నారు. బుధవారం మండలంలోని యాదిరెడ్డిపల్లిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు ఒంటరిగా ఉన్న సమయంలో జాగ్రత్తగా ఉండాలని ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. అమ్మాయిలతో అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఇన్‌చార్జ్ ఎస్ఓ కవిత, భరోసా టీం సభ్యులు జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వ్యవసాయ పరికరాలు

మన్ననూర్: ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని రైతులకు వ్యవసాయం కోసం అవసరమైన పడాలు(టార్పలిన్) గ్రీన్ నెట్ (ఎండ నుంచి మొక్కల కాపాడేందుకు) అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ రైతుల సందాన కర్త జనార్దన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్: 8897038650 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



సాయిభానుప్రతాప్(557), సీహెచ్ సిరి(576)


తేజశ్రీ(576)


నందిని(527)


శివాణి(520)


నిఖిత(516)


జయంతి(553)


సి.నందిని(537)


పి.శంకర్(563)

సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ చదువుతున్న విద్యార్థులు బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో సత్తాచాటారు. జిల్లాలోని జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీలు, గురుకులాలు, మాడల్‌స్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటారు. పలు మండలాల్లోకి వివిధ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

■ నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన ప్రిజం ది స్కూల్ విద్యార్థులు కె.వినీత్ 577 మార్కులు, డి.నవ్యశ్రీ 569 మార్కులు, కె.లక్ష్మి సాహితి, జి.శృతి 568 మార్కులతో ప్రభంజనం సృష్టించారు. అలాగే 550 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 12 మంది, 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 40 మంది ఉన్నారు.

■ నాగర్‌కర్నూల్ మెరిడియన్ స్కూల్ విద్యార్థులు లహరి 560 మార్కులు, జీవన 551, ధీరజ్‌సాయి 544, శ్రీకృష్ణ 543 మార్కులు సాధించారు. 21 మంది 500 పైగా మార్కులు సాధించారు.

■ కొల్లాపూర్ పట్టణంలో మైనార్టీ, బీసీ, ఎస్సీ గురుకుల పాఠశాలలతో పాటు చింతలపల్లి, సింగోటం, నార్లాపూర్, పట్టణంలోని మాడల్ హైస్కూల్, జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం, ఉన్నత పాఠశాలలో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ గాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో చదివి విద్యార్థి వెంకటేష్ 572 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు.

■ అచ్చంపేటలో ముస్లిం మైనార్టీ రెసిడెన్షియల్‌లో 100 శాతం ఉత్తీర్ణులవ్వగా ఆవుల కార్తీక్ 572, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సాయి భాను ప్రతాప్ 557 మార్కులు సాధించారు. , ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అర్చన 548 మార్కులు సాధించింది.

■ బిజినేపల్లి మండల కేంద్రంలోని గురుకుల బాలుర పాఠశాలకు చెందిన పి.శంకర్ 563 రెండవ స్థానం సాధించగా, కస్తూర్బా గాంధీ పాఠశాలకు చెందిన పావని 562 మార్కులతో మూడో స్థానంలో నిలిచింది. గురుకుల బాలుర పాఠశాలలో ఆర్.మోహన్ 558 మార్కులు, వట్టెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల నుంచి డీ.అక్షయ, పల్లవి అనే విద్యార్థులు 558, 540 మార్కులతో తర్వాతి స్థానంలో ఉన్నారు.

■ పెద్దకొత్తపల్లి మండలంలో 98% ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 553 మార్కులతో వినయ్ కుమార్, 553 మార్కులతో జయంతి మండలం లో అత్యధిక మార్కులు సాధించినట్లు ఎంఈఓ కే శ్రీనివాసరెడ్డి తెలిపారు.

■ కల్వకుర్తి మండలం లోని విద్యార్థులు 94 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 483 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 456 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శిరీష 546 మార్కులతో సత్తా చాటింది.

■ వెల్దండలో సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 7 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ఎల్. శివాణి 520లతో మండల టాపర్‌గా నిలిచింది. జి. నిహారిక 518, కె. నిఖిత 516, కె. అక్షర 512, కె. వైష్ణవి 503, పి. భానుప్రియ 503, టి. మమత 501 మార్కులతో ప్రతిభ చాటారు. అదే విధంగా మోడల్‌హైస్కూల్ 100 శాతం ఫలితాలు సాధించారు. కస్తూర్బాగాంధీలో 97శాతం, బాలికల ఉన్నత పాఠశాలలో 100శాతం ఫలితాలు వచ్చాయి. వెల్దండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 91శాతం ఫలితాలు వచ్చాయి.

■ ఉప్పునుంతల అన్ని ప్రభుత్వ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణులయ్యారు. వెల్టూరు జ్యోతిబాపూలే బాలికల విద్యాలయం విద్యార్థినులు తేజశ్రీ 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అదే పాఠశాలకు చెందిన విద్యార్థిని కావలి జ్యోత్స్న 569 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది.

■ తాడూరు మండలంలోని ఐతోల్ విద్యార్థి మురళీకృష్ణ 539 మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలిచారు. మొత్తం 93 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

■ తెలకపల్లి మండలంలో పదవ తరగతి ఫలితాల్లో 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 795 మంది విద్యార్థులకు గాను 779 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలికల గురుకుల పాఠశాల దీపిక విద్యార్థిని 572 మార్కులు సాధించింది. కేకే రెడ్డి పాఠశాల విద్యార్థిని సీహెచ్. సిరి 576 మార్కులు సాధించింది.

■ దోమలపెంట ప్రభుత్వ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణులయ్యారు. గాయత్రి 514 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. ఈగలపెంటలోని డీఏవీ ఆంగ్ల పాఠశాలలో స్పర్షసింగ్ 562 మార్కులు సాధించింది.

■ బల్మూర్ మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. కొండనాగుల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రుత్విక్ (576/600) మార్కులతో మండల టాపర్‌గా నిలువగా, అరుణ్‌కుమార్ (561/600) మార్కులు సాధించి రెండ స్థానంలో నిలిచినట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు కేజీబీవీ విద్యార్థినుల్లో సీ.నందిని (537/600), ఎం.నందిని(531/600), ఎస్ మల్లిక(530/600)మార్కులు సాధించారు.

■ చారకొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ పాఠశాల విద్యార్థి అంగోతు నందిని 527 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

■ లింగాల పదో తరగతి పరీక్షల్లో మండలంలోని 5 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు వచ్చాయి. మండలం కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ఎస్.అరుణ్ (545) మొదటి స్థానంలో నిలిచాడు.

■ అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రూపాదేవి తెలిపారు. ఆకుల కావ్య అనే విద్యార్థిని 559 మార్కులు సాధించి పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచింది. వటువర్లపల్లి ఆశ్రమ పాఠశాలలో 100 శాతం, దోమలపెంటలో 100 శాతం, వంకేశ్వరంలో 100 శాతం, కెజీబీవి అమ్రాబాద్‌లో 100 శాతం, కేజీబీవి పదరలో 100 ఉత్తీర్ణత సాధించారు.


శిరీష(546)


రుత్విక్(576)

సంతోషంగా ఉంది



మాది వ్యవసాయ కూలీ కుటుంబం. అచ్చంపేటలోని మైనార్టీ గురుకులంలో ఆరో తరగతి నుంచి చదువుతున్నా. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని చదివాను. 572 మార్కులు రావడం సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో ఇంజనీరవుతా.

– ఆవుల కార్తీక్, మైనార్టీ గురుకుల పాఠశాల, అచ్చంపేట

ఇంజనీర్ అవుతా..



మాది వ్యవసాయ కుటుంబం, పదోతరగతిలో 568 మార్కులు సాధించా. ఉదయం 4 గంటలకు నిద్ర లేచి చదివేవాడిని. సాయంత్రం 6 నుంచి రాత్రి 10 వరకు చదివా. భవిష్యత్‌లో ఇంజినీర్ కావాలనుకుంటున్నా.

– రామాంజనేయులు, జెడ్పీహెచ్ఎస్, గౌరెడ్డిపల్లి

రూ.2.98 లక్షల రికవరీకి ఆదేశాలు

లింగాల: మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధి పనులలో రూ.2.98 లక్షలు రికవరి చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఉపాధి పనులకు సంబంధించి మంగళవారం రాత్రి వరకు కొనసాగిన ప్రజా వేదికలో 23 గ్రామ పంచాయతీలకు సంబంధించి తనిఖీ బృందాలు నివేదికలను సమరించారు. ఇందులో రికవరి రూ.2.50,348లు కాగా పెనాల్టీ రూ.48 వేలు ఉన్నాయి.

పంచాయతీల వారిగా వివరాలు

అంబట్‌పల్లి రూ.3,730, అప్పాయపల్లి రూ.40,715, అవుసలికుంట రూ.8.102, క్యాంపు రాయవరం రూ.2,123, చెన్నంపల్లి రూ.1,021, దత్తారం రూ.2,511, దారారం రూ.5,914, జీల్గుపల్లి రూ.33,471, కోమటికుంట రూ.1,159, కొత్తచెర్వుతండా రూ.25,741, కొత్తకుంటపల్లి రూ.25,822, లింగాల రూ.27,994 ఉన్నాయి. అదేవిధంగా మగ్దూంపూర్ రూ.2,515, మల్లానిచెర్వుతండా రూ.1,300, పద్మన్నపల్లి రూ.3,829, రాంపూర్ రూ.4,616, రాయవరం రూ.5,274, శ్రీరంగాపూర్ రూ.600, సూరాపూర్ రూ.76,004, శాయిన్‌పేట రూ.2,872 రికవరి కట్టాల్సి ఉంది. వల్లభాపూర్, బాకారం, అప్పాపూర్‌పెంట గ్రామ పంచాయతీలలో ఎలాంటి రికవరిలు లేవని అధికారులు వెల్లడించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలుశిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. జిల్లా కేంద్రంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా గంగారం గ్రామానికి చెందిన ఇస్లావత్‌రాజు, నాగర్‌కర్నూల్‌కు చెందిన జల్లరి పెరుమాల్, మంతటి గ్రామానికి చెందిన లక్ష్మయ్య మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా పోలీసుల తనిఖీలలో పట్టుబడ్డారు. ముగ్గురిని జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కావ్య ఎదుట బుధవారం హాజరుపర్చగా ముగ్గురికి ఒక రోజు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తు తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

అభ్యుదయవాది బసవేశ్వరుడు


బసవేశ్వరుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: అభ్యుదయవాది బసవేశ్వరుడు, ఆయన జీవితం అందరికి ఆదర్శమని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మ బసవేశ్వర 892వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అదనపు కలెక్టర్ అమరేందర్ , మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, జిల్లా వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు జెమినీ సురేష్, అధ్యక్షులు కెంచే గిరిజా శంకర్, ప్రధాన కార్యదర్శి కెంచే రాజేష్ కుమార్, కోశాధికారి రాజశేఖర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

వెల్దండ: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత కలుగుతుందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్‌స్టేజి వద్ద, గుండాలలోని అంబా రామలింగేశ్వరస్వామి ముఖద్వారాన్ని వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖద్వారం నిర్మాణ దాతలు బొల్లంపల్లి గ్రామానికి చెందిన సిలివేరు రామస్వామిగౌడ్, అలివేలు దంపతులను వారు సన్మానించారు.

భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి పేర్కొన్నారు. ధరణిలో లోపాలు ఉండడంతో గ్రామాల్లో రైతులు భూములు నష్టపోయేవారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూ భారతిని తీసుకురావడంతో రైతుల భూములను కాపాడుకోవచ్చన్నారు. గ్రామ గ్రామాన ప్రజలకు భూ భారతిపై అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు బాలాజీసింగ్, నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, మోతిలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, పుల్లయ్య, తిరుపతిరెడ్డి, దేవాలయ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఈఓ ప్రసాద్, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

మండలంలోని కొట్రలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహన్ని బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల చరిత్రలను భవిష్యత్ తరలకు అందిద్దామన్నారు. భూపతిరెడ్డి, మట్ట వెంకటయ్యగౌడు, శంకర్‌నాయక్, గ్రామ పెద్దలు, అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని వినతి


వెల్దండలో ఎంపీడీఓ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

వెల్దండ: బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మణ్‌కు జాతీయ ఉపాధి హామీ సిబ్బంది వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు అందడం లేదన్నారు. నిరంతరం పనులు చేస్తున్న వేతనాలు అందకం కుటుంబం గడవటం కష్టంగా మారిందన్నారు. కార్యాలయానికి వచ్చిన పనులు చేయడం లేదన్నారు. అనంతరం సమ్మె నోటీసు, వినతిపత్రాలను ఉపాధి సిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వర్‌జీ, ఈసీ దేవేందర్‌గౌడ్, టీఏలు సత్యనారాయణ, లింగస్వామి, రాము, ఆయా గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

చారకొండ: మూడు నెలలుగా ఎస్ఆర్డీఎస్, ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులకు మూడు నెలలుగా, గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెలలుగా వేతనాలు మంజూరు కాలేదని వెంటనే విడుదల చేయాలని బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్‌కు మండల ఉపాధి ఉద్యోగులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీఓ లక్ష్మయ్య మాట్లాడుతూ జీతాలు లేక కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యోగులతో సమ్మె నోటీస్ అందిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈసీ రవి, టీఏలు అల్లాజి, యాదయ్య, ఖాదర్, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీను, లక్ష్మయ్య, తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ అవార్డు రావడంపై హర్షం

చిన్నంబావి: మండలంలోని బెక్కెం గ్రామానికి చెందిన ప్రముఖ విద్యసంస్థల అధినేత ధారసింగ్‌కు అంబేడ్కర్ ఎక్స్‌లెన్స్ అవార్డు రావడంపై శ్రీశైలం నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను బెక్కెం గ్రామంలో ఆయన నివాసంలో శాలువాతో సన్మానించారు. శ్రీశైలం నిర్వాసితుల సమస్యపై కేంద్ర మంత్రులను కలిసి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరడమే గాక హైకోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం నాయకులు దావోజీ, నారాయణరెడ్డి, కృష్ణ, రంగస్వామి, విష్ణు సాగర్, కావలి గోపాల్, సాయి ప్రణీత్ గౌడు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కింద పడి ఫైర్ వాచర్ మృతి

లింగాల: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పుల్లయ్యపల్లి పెంటకు చెందిన అటవీ శాఖ ఫైర్ వాచర్ తోకల సలేశ్వరం (28) ఇంటిలో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. గత నెల 28న విధుల్లో భాగంగా అన్న రవితో కలిసి అటవీ ప్రాంతానికి వెళ్లి అదే రాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటిలో అటకపై ఉన్న ఆహారాన్ని తీసుకోవడానికి సెల్ఫ్ ఎక్కిన సలేశ్వరం ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం తగలడంతో 29న అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి డాక్టర్ల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం ఉస్మానియాకు తరలించారు. అక్కడి డాక్టర్లు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య తోకల మల్లమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటా



కొల్లాపూర్ రూరల్: బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటానని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని కుడికిల్లలో అనారోగ్యంతో మృతి చెందిన మాచిపల్లి భీమరాజు పార్థివదేహనికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్మన్‌బెట్లలో మృతి చెందిన కోళ్ల కిష్టమ్మ దశదిన కర్మలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మృతి చెందిన ఇరువురి కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటానని మృతుల కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేకల నాగరాజు, సింగిల్ విండో డైరెక్టర్ రఘుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల రీ సర్వే



మన్ననూర్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పారదర్శకంగా ఉండేందుకు మండల అధికారులు రీ సర్వే చేపట్టారు. బుధవారం అమ్రాబాద్ మండలంలోని వెంకటేశ్వర్లబావిలో ఎంపీడీఓ జగదీశ్వర్ మండల అధికారులతో కలిసి గ్రామంలో ఇదివరకే తయారు చేసిన 24 మంది ఇందిరమ్మ ఇళ్ల లబిదారుల జాబితాను ఇంటింటికి తిరుగుతూ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ రఘు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, నాయకులు మద్దెల దివాకర్, అంజనారాయణ, నిరంజన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏఓకు వినతి

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాలో బీసీ సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి అశోక్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ వినతిపత్రం సమర్పించారు. నవీన్ కుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలి

పానగల్: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నర్సింగ్ విద్యార్థిని మనిషాశ్రీ కుటుంబానికి ప్రభుత్వ పరంగా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రాయినిపల్లి గ్రామానికి చేరుకొని విద్యార్థిని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలి

మన్ననూర్: దేశ భద్రతకు, సంక్షేమానికి పెను సవాలుగా మారిన ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేయాలని విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సంబు వెంకటరమణ, మైనార్టీ జిల్లా నాయకుడు ఎంఎ రహీం డిమాండ్ చేశారు. బుధవారం మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. పాక్ ప్రేరేపిత మూకలు పహల్గామ్‌లో టూరిస్టులపై ఘాతుకం దురదుష్టకరమన్నారు. అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం శాంతి మార్గంలో నడుచుకుంటున్న భారత్‌పై పాకిస్తాన్ టెర్రరిస్టుల ముసుగులో తరుచుగా ఏదో ఒక సంఘటతో ఇబ్బందులు, ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఈ క్రమంలో దేశ భద్రత విషయంలో సైన్యానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం సంతోకరమన్నారు. ఉగ్రమూకలను పట్టుకుని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, శివాజీ, హన్మంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

గాలివాన బీభత్సం


నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారి గట్టుతుమ్మెన్ వద్ద రోడ్డుపై విరిగి పడిన చెట్టు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం గాలివాన బీభత్సం సృష్టించింది. బలమైన గాలులు వీచడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల వరి ధాన్యం తడిసింది.

■ కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో వర్షానికి ధాన్యం కొట్టుకుపోయింది. అదేవిధంగా వేరుశనగ బస్తాలు వర్షానికి తడిచాయి.

■ అచ్చంపేట, బల్మూర్, లింగాల, ఉప్పునుంతలతో పాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని వరిధాన్యం తడిసిపోయింది. అచ్చంపేట మండలం మన్నెవారిపల్లిలో పిడుగుపాటుకు జక్కుల సాయిలుకు చెందిన 24 గొర్రెలు మృతి చెందాయి. రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి.

■ చారకొండ మండల వ్యాప్తంగా గంటపాటు వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో చెట్లు విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జూపల్లిలో చెట్లు విరిగి దారులకు అడ్డంగా పడ్డాయి. విద్యుత్ తీగలు తెగి కిందపడ్డాయి. గోకారంలో గ్రామానికి చెందిన జమ్ముల నారయ్య, పాపయ్య ఇంటి రేకులు ధ్వంసం అయ్యాయి.

■ బల్మూర్ మండలంలోని నాగర్‌కర్నూల్–అచ్చంపేట ప్రధాన రహదారిలోని పోలిశెట్టిపల్లి నుంచి తుమ్మెన్‌పేట వరకు గాలివాన తాకిడికి రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లు విరిగి అడ్డంగా పడ్డాయి. వాహనాల రాకపోకలకు గంటల తరబడి ఇబ్బందులు పడ్డారు. కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యం తడవగా, కోత దశలో ఉన్న వరి పంటలు నేలకొరిగాయి.

■ ఉప్పునుంతల మండలంలోని దాసర్లపల్లిలో పాడి ఆవు పిడుగుపాటు మృతిచెందింది.


మన్నెవారిపల్లిలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన గొర్రెలు


గోకారంలో కూలిన పైకప్పు